
# మైగాడ్!

సుమ్మా ప్రసాదరావు



**సూర్యనారాయణ మూర్తి ఎంత ప్రత్యక్ష దైవం అయితే మట్టుకు పుట్టిన ప్రతీ కుఱ్ఱవాడికి అతని తల్లితండ్రులు ఆపేరే పెట్టాలా? ఇక్కడకు దగ్గరలోని అరసవిల్లిలో అతని ఆలయం ఉండవచ్చు, ముక్కోటి దేవతల్లో అతడు ముఖ్యుడే కావచ్చు, అంతగా అతని పేరు పెట్టాలనుకుంటే రవి, భాను, ఆదిత్య, మార్తాండ్, భాస్కర్ ఇలా ఎన్ని ముచ్చటైన పేర్లు లేవు! వాటన్నిటిని వదిలేసి సూర్యనారాయణమూర్తే అని అందరూ పేర్లెందుకు పెడతారు?**

ప్రకాశరావు ఇంట్లో తల పట్టుకుని కూర్చుని ఆలోచిస్తున్నాడు. అప్పుడే సమయం మధ్యాహ్నాం నాలుగు గంటలు కావచ్చింది. మధ్యాహ్న మార్తాండుడు తనవేడి తీక్షణ కిరణాలతో అంతవరకు ప్రకాశరావుని బాధపెట్టాడు. తొమ్మిది గంటల నుంచి గ్రీష్మ కాలపు మండుటెండలో కాలుగాలిన పిల్లిలా ఆ ఇంటికి ఈ ఇంటికి చెడ తిరిగి అలసిపోయాడు ప్రకాశరావు.

శ్రమపడ్డా ఫలితమేమైనా ఉందా? తల నొప్పి, ఎడతెగని ఆలోచనలు మిగిలాయి. అయ్యో ఒరి శ్రమేనా, రెండు వేల రూపాయలు ఉత్తి పుణ్యానికి ఖర్చు అయ్యాయి. పర్సులో ఉన్న బరువంతా తలలోనికి ఊర్ధ్వ చలనం జరిగిందా అన్నట్లు పర్సు తేలికై తలభారమైంది.

ప్రకాశరావు ఎందుకు బాధ పడుతున్నాడు? సూర్యనారాయణ మూర్తినేల దూషిస్తున్నాడు?

ఈ విషయాలు తెలుసు కోవాలంటే ఫ్లాష్ బాక్ తప్పదు.

అంతకు ఎనిమిది గంటల ముందు అంటే

ఉదయం ఎనిమిది గంటలకు హోటల్లో టిఫిన్ తిని ఏ స్నేహితుడి ఇంటికైనా వెళ్లి కాస్త సేపు పిచ్చాపాటి మాట్లాడి తను ఊర్లో లేని ఈవారం దినాల సంగతులు తెలుసుకోవాలని బయలుదేర బోతున్న సమయంలో....

ప్రకాశరావు బ్రహ్మచారి కాడు. అతని భార్య ఇందుమతి తరచు వెళ్తునట్లే పుట్టింటికి వెళ్లింది.

ప్రకాశరావు బయలుదేర బోతున్న సమయంలో సూర్యం వచ్చాడు.

"రావోయ్ సూర్యం!" అన్నాడు ప్రకాశరావు.

'నయమే వీడు వచ్చే సరికి ఇందుమతి లేదు. ఆమె ఉంటే ఈ రోజు ఎంత రభస జరిగి ఉండేది' అనుకున్నాడు ప్రకాశరావు.

ప్రకాశరావు, సూర్యనారాయణ మూర్తి కలసి బి.ఎస్.సి. వరకు చదువుకున్నారు. మేనమామ పరపతి మీద అలెంబిక్ కంపెనీలో సేల్సు డిపార్ట్ మెంటులో చేరేడు ప్రకాశరావు. సూర్యం బి.ఇడి.చేసి స్కూల్లో టీచరుగా స్థిరపడ్డాడు. సూర్యం చదువు పూర్తికాకుండానే అతని తల్లిదండ్రులు మేనరికం అంటూ వాడి మెడలో డోలు తగిలించారు.

'ఒరేయ్! చదువా ఇంకా పూర్తి కాలేదు. ఉద్యోగం అసలే లేదు. ఇప్పుడు పెళ్లేమిటిరా?' అని ప్రకాశరావు ఎంత బోధపరిచినా 'అమ్మానాన్నల మాట ఎలా కాదనగలను?' అంటూ తలవంచుకున్నాడు. ఆరేళ్లలో ముగ్గురు పిల్లల తండ్రి అయ్యాడు. అష్టకష్టాలుపడి ఈ మధ్యనే చెల్లెలి పెళ్లి చేశాడు. తల్లీతండ్రి ఉన్నారు. వాడి ఆర్థిక ఇబ్బందులు ప్రకాశరావుకి తెలియనివి కావు. ఎంతో అత్యవసరం అయితేనే కాని తనను వెతుక్కుంటూ రాడని ప్రకాశరావుకి తెలుసు. ఆ కుటుంబం పట్ల అతనికి ఎనలేని గౌరవం ఉంది. తనీనాడు ఈ స్థితికి ఎదగడానికి సూర్యం తండ్రిచలవేనని ప్రకాశరావు అభిప్రాయం. పైగా అప్పుల్ని ఆదుకోవడానికి వెనుకంజ వేయని జాలి గుండె అతనిది.

ఇందుమతికి ఇలాంటి దానాలూ ధర్మాలు ఇష్టం లేవు. ఇందుమతి స్త్రీసహజంగా అంటున్నదని ఆమెను తప్పుపట్టడం అర్థం లేనిదని ప్రకాశరావుకి తెలుసు. వీలైనంత వరకు ఆమెకు నచ్చ చెప్పేవాడు. అతని దగ్గర అప్పులు తీసుకునే వారిలో కొందరు ఆడిన మాట తప్పకుండా తీర్చేవారు. కొందరు ఉన్నప్పుడు అంతో ఇంతో తీరుస్తూ మొత్తానికి ఋణ విముక్తులయ్యేవారు. ఇంకొందరు మాత్రం 'నీ ఋణం ఈ జన్మలో తీర్చలేనురా!' అనేవారు. అది యధార్థం కూడాను. అయితే ప్రకాశరావు ఈ మూడు ప్రవృత్తులవారిని సమయానికి ఆదుకువానే వాడు.

"ఊరక రారు మహాత్ములు" అన్నాడు సూర్యం కుర్చీలో కూర్చున్న తరువాత తనూ కుర్చీలో కూర్చుంటూ ప్రకాశరావు. "ఇంకా నయం మరో పది నిముషాలు పోయిన తరువాత వచ్చి ఉంటే వీధి గేటుకి తాళం దర్శనమిచ్చేది నాకు బదులుగా.'

"నాకు తెలుసు. మొన్న నేను రామాన్ని కలిశాను. నువ్వు ఆఫీసు పని మీద ఢిల్లీ వెళ్లావని శనివారం వస్తున్నావని చెప్పాడు. ఉదయాన్నే బయలుదేరాలనుకున్నాను. ఏదీ ఇప్పటికి కుదిరింది. పెళ్లికేనా నీవు వెళ్తున్నది? ప్రకాశ్! నాకు అర్జంటుగా అయిదువందలు కావాలి. వీలు వెంట తీరుస్తానులే" అన్నాడు సూర్యం.

సూర్యం అనవసరంగా అప్పులు చేయడని, ఎప్పుడైనా అవసరం వస్తే తన దగ్గరికే వస్తాడని అతనికి బాగా తెలుసు. పర్సులోంచి అయిదు వందల రూపాయలు లెక్కపెట్టి ఇచ్చి 'పెళ్లికేనా వెళ్తున్నావు అని అడిగావు. ఎవరి పెళ్లి ఇంతకూ?' అడిగాడు ప్రకాశ రావు.

"నాకూ అంతగా తెలియదు. రామం మొన్న నాతో మాటల సందర్భంలో ఎవరిదో పెళ్లి ఉందని నీవు తప్పక ఆ పెళ్లికి వెళ్తావని చెప్పాడు. ఆ ఎవరో సూర్యనారాయణ మూర్తిగారి నుంచి నీకు శుభలేఖ వచ్చిందట."

ప్రకాశరావు ఆలోచనలో పడ్డాడు ఎవరీ సూర్యనారాయణ మూర్తి? బహుశా శుభలేఖ ఆఫీసు అడ్రసుకి వచ్చి ఉంటుంది. తను తప్పక వెళ్లే పెళ్లి అన్నాడా రామం? ఎవరిదై ఉంటుంది?

సూర్యం మరే వివరణా ఇవ్వలేకపోయాడు. "నాకు మరేమీ తెలియదు. రామాన్ని కలుసుకుంటే తెలుస్తుంది" అంటూ సూర్యం వెళ్లిపోయాడు.

పెళ్లి ఈ రోజా? ఉదయమా రాత్రా? తనా పెళ్లికి వెళ్లకపోతే వాళ్లు తప్పు పట్టుకునే అవకాశం ఉంది. ఎవరింటిలో పెళ్లో? ఇంటికి తాళం వేసి టిఫిను మాట మరచి పోయి రామం ఇంటికి వెళ్లాడు.

"నువ్వు టూర్‌లో ఉన్నప్పుడు శుభలేఖ వచ్చింది. నిజమే సూర్యంతో అన్నాను. పెళ్లి కార్డు సూర్యనారాయణ మూర్తి గారు దగ్గరనుంచి వచ్చింది. కవరు మీద పెళ్లి ఈరోజే అని ఉంది. ఈ మధ్యనే చెల్లెలి పెళ్లి చేశావ్. ఈ పెళ్లి ఎవరిదిరా? ప్రకాశ్‌కి శుభలేఖ పంపావు నాకు పంపలేదేం?" అంటూ సూర్యంతో హాస్యానికన్నాను, పెళ్లికార్డు మీద సూర్యనారాయణ మూర్తి పేరు చూసి ఆ శుభలేఖను నేను పూర్తిగా చూడలేదు. పెళ్లి కూతురి పేరు పెళ్లి కొడుకు పేరూ చూశాను కాని గుర్తు లేవురా! ఆశుభలేఖ మీ ఇంట్లో పడేసి రమ్మని మా అబ్బాయి చేతికిచ్చానే! నీకు దొరకలేదా?" రామం అన్నాడు.

"లేదురా! దొరికి ఉంటే ఇక్కడకు వచ్చేవాడినా? రెండు మూడు ఉత్తరాలు ఉన్నాయి. అందులో ఏదీ శుభలేఖ కాదు. మీ రాజునొక మారు పిలువు. ఆటల సందడిలో మా ఇంటికి వెళ్లలేదేమో. ఇక్కడే మీ ఇంట్లో ఉందేమో?"


రామం తన కొడుకు రాజుని పిలిచాడు. శుభలేఖ విషయం అడుగుతే వాడు జవాబు చెప్పకుండా ఏడుపు లంకించుకున్నాడు.


రామం వాడితో దెబ్బలాడబోతే ప్రకాశరావు వారించి రాజుని మెల్లగా అడిగాడు.

"మరేమో నేను మీ ఇంటికి వస్తూ ఉంటే చెల్లాయి తనూ వస్తానంటూ మారాం చేసింది. నా చేతిలో ఉత్తరం తీసుకుని ముక్కలు ముక్కలుగా చించేసింది." అంటూ తప్పు చేసిన వాడిలా ఏడుస్తూనే ఉన్నాడు.

""పోనీలే!" అన్నాడు ప్రకాశరావు మరేమనాలో తోచక.

"పోనీలేరా! నువ్వా పెళ్లికి వెళ్లకపోతే కొంపలేం మునిగిపోవు. వారెప్పుడైనా అడుగుతే శనివారం వరకు ఊర్లో లేను. ఆదివారం సెలవు. మీరేమో ఆఫీసు అడ్రసుకి పంపారు. అని చెప్పవచ్చు"






అన్నాడు రామం.

"సరే" అంటూ బయలుదేరాడు.

"ఒరేయ్! ఆ పెళ్లికార్డు చాలా ఖరీదైనదిరా! నా మూలానా నువ్వో మంచి పార్టీ మిస్సయ్యావు సారీ" అన్నాడు రామం.

ఖరీదైన కార్డా? అయితే కొంపలు మునిగినా మునగవచ్చు, అంటుకున్నా అంటుకోవచ్చు. అయితే ఎవరా సూర్యనారాయణ మూర్తి?

అయ్యో? నా కింత సేపూ తట్టలేదేం? సూర్యనారాయణ మూర్తంటే వేరే ఎవరో ఎందుకౌతారు? అలెంబిక్ కంపెనీ డిప్యూటీ జోనల్ మేనేజర్. వారమ్మాయికి పెళ్లి నిశ్చయమైంది. బహుశా ఆ కార్డు ఆ పెళ్లికి సంబంధించిందే అయి ఉంటుంది.

ప్రకాశరావు టిఫిన్ చేస్తున్నవాడు తటాలున లేచి బిల్లు చెల్లించి గిఫ్టు వస్తువులు అమ్మే షాపుకి వెళ్లాడు. అక్కడ వివిధ రకాల వస్తువులు చూసిన తరువాత 'జోనల్ మేనేజర్ గారింటి పెళ్లా? ఈ కానుక బాగుంటుంది. ప్యాక్ చెయ్యనా?" అన్నాడు షాపువాడు. అదొక సీనరీ. వాల్ హేంగర్. లోపల రంగు రంగుల బల్బులు వెలుగుతూ ఆరుతూ ఉంటాయి. చాలా అందంగా ఉంది. ఖరీదు ఏడు వందలు.

అప్పటికే ఆలశ్యం అయిందేమోనన్న గాబరాలో వాడికి డబ్బులిచ్చి తిన్నగా డిప్యూటి జోనల్ మేనేజరు సూర్యనారాయణమూర్తి గారింటికి వెళ్లాడు. అక్కడ పెళ్లి సందడి లేకపోవడంతో ఆశ్చర్యపడ్డాడు. తను తప్పు చోటుకి వచ్చాడా? అని అనుమాన పడ్డాడు. తిరిగి వెనక్కు వెళ్లిపోవాలనుకుంటూ ఉండగా సూర్యనారాయణ మూర్తిగారు బయటకు వచ్చి పలకరించారు. "రావోయ్ ప్రకాశ్! ఢిల్లీ నుంచి ఎప్పుడు వచ్చావు? ఏమిటిలా వచ్చావు ఏదైనా పనా?"

అని చూపులు ప్రకాశరావు చేతిలోని పాకట్టు మీదే ఉన్నాయి.

"అబ్బే! ఏనేం లేదుసార్! ఢిల్లీ మార్కెటింగుకి వెళ్తే ఓ షాపులో ఓసీనరీ కనిపించింది. మీ రాధకు ఇలాంటివి ఇష్టమని కొని తెచ్చాను" అన్నాడు పేకట్టు అతనికి అందిస్తూ.

"నీ అభిమానం నాకు తెలుసోయ్. కూర్చో కాఫీ తాగి వెళ్దువుగాని" అన్నారతను.

"లేదండి! వస్తాను. సార్! మీ అమ్మాయి పెళ్లి ఎప్పట్లో?"

"భలేవాడివోయ్! రాధ పెళ్లికి నువ్వూ, ఇందుమతి రారా? మా కాబోయే అల్లుడు బొంబాయిలో ఏదో అడ్వాన్సు ట్రైనింగుకి వెళ్లాడు తిరిగి రాగానే ముహుర్తాలు" అన్నారు.

పెళ్లి ఈ సూర్యనారాయణ మూర్తి గారింటిలో కాదు. మరి ఎవరింటిలో పెళ్లి?

విజయా కెమికల్స్ పార్టనర్ సూర్యనారాయణ మూర్తి గుర్తుకొచ్చాడు ప్రకాశరావుకి. అతనికీ పెళ్లి కావలసిన కూతురుంది. మూర్తిగారి భార్య ఇందుమతిని స్వంత కూతుర్లా చూస్తుంది. ఆ పెళ్లి వారింటే అనిపించింది. ప్రకాశ రావుకి తిరిగి ఆ గిఫ్టు షాపుకి వెళ్లాడు.

వాడు వివరాలు అడక్కముందే "ఈ రోజున రెండు పెళ్లిళ్లున్నాయి. ఈమారు ప్రెజెంటేషను కొంచెం తక్కువ ధరది చూపు" అన్నాడు. వాడు చూపిన వాటిలో ఆరువందలు విలువ చేసేది బాగుందనిపించింది. ఇందుమతి సంతోషం కోసం దాన్ని పాక్ చేయించాడు. ఇప్పుడు ప్రకాశరావు విజయా కెమికల్స్ పార్టనర్ ఇంటికి వెళ్లాడు. తను రెండోమారు మోసపోయాడు.

కుశల ప్రశ్నల అనంతరం సూర్యనారాయణ మూర్తి గారి భార్యే అంది " ప్రకాశ్! మా మీనాకు ఓ మంచి సంబంధం చూడు. మీ బాబాయి గారిదంతా అశ్రద్ధ" అని. వారింటిలో భోజనం చేశాడు. బాగుండదని తను తెచ్చిన కానుక మీనా చేతిలో పెట్టాడు.

తన జేబుల నుంచి డైరీ తీసి చూశాడు. అందులో అయిదుగురు సూర్యనారాయణ మూర్తులు, ఒక సూర్యనారాయణ ఉన్నారు. ఇద్దర్ని అనుకుని తను ఇప్పటికే మోసపోయాడు. ఒక సూర్యనారయణ మూర్తి ఉదయాన్నే తన ఇంటికి వచ్చాడు. మిగిలిన ఇద్దరిలో ఒకరికి పెళ్లి కావలసిన కూతుళ్లు, చెల్లెళ్లు లేరు. ఇక మిగిలింది ఒకే సూర్యనారాయణ మూర్తి, సూర్యనారాయణ రావు.

ఎలాగైనా సాధించాలన్న పట్టుదల వచ్చింది ప్రకాశరావుకి. ఈ పర్యాయం మరో షాపుకి వెళ్లి నాలుగు వందల విలువైన రాధా కృష్ణుల వెండి విగ్రహాలు తీసుకున్నాడు. ఆ ప్రజంటేషనూ నీళ్లధారే అయింది. తిరిగి మరో ప్రజెంటేషను మూడు వందలది సూర్యనారాయణ రావు గారింటిలో సమర్పించాడు. అంటే అక్కడా పెళ్లిలాంటి వ్యవహారం లేదు. వాళ్లిచ్చిన కాఫీ ఫలహారాలు సేవించి ఇంటికొచ్చాడు. అప్పుడు మధ్యాహ్నం నాలుగైంది.

దినమల్లా తిరిగి తిరిగి అలసిపోయాడేమో నిద్ర పట్టింది.

తలుపు శబ్దం, కాలింగ్ బెల్ మ్రోత విని లేచాడు. వాచీ చూశాడు. ఆరు గంటలైంది

తలుపు తీశాడు. ఇంటి ఓనరు గారి మనుమరాలు. "బాబాయ్! అనకాపల్లి నుంచి మీకు ఫోను" అని చెప్పి పారిపోయింది.

ఇందుమతే అయి ఉంటుంది.

వీధి గడియ వేసి వెళ్లాడు వారి భాగంలోనికి.

"రా! ప్రకాశ్ ఇందూ ఫోన్ చేసింది. పది నిముషాల తరువాత మళ్లీ చేస్తుంది. కూర్చో కాఫీ తెస్తాను" అంది వరలక్ష్మమ్మగారు. ఆవిడిచ్చిన కాఫీ తాగుతూ ఉంటే టెలిఫోను గణగణమంది. ప్రకాశరావు రిసీవరందుకున్నాడు.

ఇందుమతి చెప్పింది విని "ఓ మైగాడ్!" నాకా విషయం తెలియదు. నేను రాత్రే వచ్చాను. నా కే శుభలేఖా అందేలేదు.... ఆ వస్తాను... ఏమిటీ వి.ఐ.పి. బ్రీఫ్‌కేసా?.... మరీ అంత ఖరీదైన ప్రజెంటేనా?.... ఓకే అలాగే" ఫోను పెట్టేశాడు.

అప్పటికే పర్సు ఖాళీ అయింది.

"అనకాపల్లిలో ఇందుమతి చిన్నాన్న గారి కూతురు పెళ్లిట. మీ దగ్గర వెయ్యిరూపాయలు ఉన్నాయా?" అన్నాడు.

"అంత డబ్బా? నా దగ్గర ఎక్కడిది? ఆయన ఇంట్లో లేరు" అంది వరలక్ష్మమ్మ.

'ఈ ఫోను ఉదయమే వచ్చి ఉంటే...' స్వగతంగా అనుకున్నాడు.

పెళ్లికి వెళ్లాలి. ముందుగా వెయ్యి రూపాయలు అప్పు కోసం.

ఇప్పుడు ఏ సూర్యనారాయణ మూర్తి దగ్గరకూ తను వెళ్లలేదు. ఏం తనొక సూర్యనారాయణ మూర్తిని కలియ లేదుగా?!

"వస్తాను పిన్నిగారు!" అన్నాడు ప్రకాశరావు.